# ఒక గతి - ఒక శ్రుతి

ఆ స్టేషన్‌లో రైలు ఆగిపోయి అప్పటికి అరగంట దాటింది. సాధారణంగా అలాంటి చిన్న స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు రెండు, మూడు నిమిషాల కంటే ఎక్కువసేపాగవు. ఎంతసేపటికీ రైలు కదలకపోయేసరికి 'క్రాసింగ్' ఏదైనా ఉందేమో అనుకొని చేతిలోని పత్రికను చూడడంలో మునిగిపోయాను. నా ఎదురుగా కూర్చున్న ప్రయాణీకులు 'ఏమై ఉంటుందబ్బా' అని గొణుక్కుంటూ ఒకరి తర్వాత ఒకరు అప్పటికే మెల్లమెల్లగా ప్లాట్‌ఫామ్ మీదకి జారుకున్నారు. ఆ చిన్న స్టేషన్లో, చిన్నపాటి ప్లాట్‌ఫామ్ మీద ప్రయాణికులు ఏమీ తోచక అసహనంగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ప్రయాణీకుల కలకలం కంపార్ట్‌మెంటులో కూర్చున్న నాకు స్పష్టంగా వినిపిస్తూనే ఉంది. కారణాలు ఆరా తీస్తున్నట్లు వాళ్ళ స్వరాలనుబట్టి నాకు కొంత అర్థమవుతూనే వుంది.

గడియారం కేసి చూసుకున్నాను. మూడు గంటలు కావస్తోంది. అంటే, స్టేషన్లో రైలు ఆగి దాదాపు నలభై నిమిషాలు... ఏమై ఉంటుంది?

నేను కూడా నెమ్మదిగా కంపార్ట్‌మెంట్‌లోంచి దిగి ప్లాట్‌ఫామ్ మీది కొచ్చాను. మే నెల కావడం వల్ల ఎండ ఇంకా చురుగ్గానే ఉంది. ప్లాట్‌ఫామ్‌కు అనుకునే ఉన్న వేపచెట్టు నీడలో నిల్చున్న గుంపు దగ్గరకు వెళ్ళి "ఏమైందండీ? ఎనీ ఇన్ఫర్మేషన్" అనడిగాను ఆసక్తిగా.

"ముందు స్టేషన్‌కు దగ్గర్లో ఒక గూడ్స్ బండి ఒంటిగంటప్పుడు పట్టాలు తప్పిందట" అన్నాడొకాయన.

'మరో అయిదారు గంటలు పడుతుందట లైన్ క్లియర్ కావడానికి' అంటున్నాడు మరో ప్రయాణికుడు.

"అయిదారు గంటలో అయిదారు దినాలో ... మన గతేమిటా అని! ఏ సౌకర్యమూ లేని స్టేషన్లో చిక్కుకుపోయామే! వేరే ఏర్పాట్లు చేస్తారా చెయ్యరా...ఇంతకూ" అంటూ అంగలారుస్తున్నాడో ముసలాయన.

వాళ్ళ మాటలు వింటూ బాగా నీరసపడిపోయాను నేను. ప్రయాణం సజావుగా సాగి ఉంటే మరో గంటకల్లా నేను చేరాల్సిన చోటుకు చేరగలిగేవాణ్ణి. అక్కడ నాకోసం ఎదురుచూస్తున్నవాళ్ళ సంగతేమిటి అని ఆలోచనల్లో పడిపోయాను.

అది చాలా చిన్న స్టేషన్‌లా ఉంది. తినుబండారాలూ, కాఫీ, టీ లాంటివి ఉన్నా, ఇంతమందిని ఎలా ఆదుకుంటాయి? దాదాపు ప్రయాణికులంతా ప్లాట్‌ఫామ్ మీద చాలా అసహనంగానూ, ఇబ్బందిగానూ అటూ ఇటూ అలజడిగా తిరుగుతున్నారు. ఇంతకూ స్టేషన్ పేరేమిటా అని అటూ ఇటూ చూశాను. 'చింతకుంట' అన్న పేరు పెద్ద అక్షరాలతో హిందీలోనూ, తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ రాసిన బోర్డు కనిపించింది.

నేనిప్పుడేం చేయడం? స్టేషన్ బయటకు వెళ్ళి బస్సు సౌకర్యం ఏదేనా ఉందేమో విచారించాలి. అనుకుంటూండగా, ఆ సమాచారం కూడా చాలామంది వాకబు చేశారేమో, అది కూడా నా చెవిన పడింది. అలాంటి ఆశలేమీ పెట్టుకోవాల్సిన అవసరం లేదని తేలిపోయింది.

ఇక ఏమీ పాలుపోక మళ్ళీ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళి నా స్థానంలో కూర్చుని నింపాదిగా సిగరెట్ వెలిగించుకున్నాను. ఎందుకో ఆ క్షణంలో ఉన్నపళంగా నా మెదడులో చిన్న మెరుపు లాంటిది మెరిసింది. 'చింతకుంట', 'చింతకుంట' అని నాలుగైదుసార్లు గట్టిగానే గొణుక్కున్నాను. ఎక్కడో విన్న పేరు. ఎప్పుడో విన్న పేరు. బాగా పరిచయమున్నట్లు అనిపించిన పేరు. నా స్మృతుల పేటికను గబగబా తెరచి వెదకడంలో మునిగిపోయాను.

నాలుగైదు నిమిషాలకల్లా మబ్బు విడిచిన ఎండలా తట్టింది, ఈ చింతకుంట నా చిన్ననాటి స్నేహితుడు గంగాధరం ఊరు అయి ఉంటుందని. గంగాధరం అప్పుడప్పుడు చెప్పిన గుర్తులన్నీ ఒక క్రమంలో స్ఫురణకు వచ్చాయి. అవును, ఇది నిస్సందేహంగా గంగాధరం ఊరే.

బ్రీఫ్‌కేస్ చేతబట్టుకొని, కంపార్ట్‌మెంట్ దిగి, గుంపులు గుంపులుగా ఉన్న ప్రయాణీకుల మధ్యసందు చేసుకొని స్టేషన్ బయటకొచ్చాను. స్టేషన్ బయట నిల్చుని చూస్తే, అక్కడక్కడా గుబురు చెట్లూ, చెట్ల మధ్యలో కనిపిస్తున్న మేడలూ, మిద్దెలూ, అక్కడక్కడా వీధుల్లో నడుస్తున్న మనుషులూ – ఒక దృశ్యంలా కళ్ళముందు నిలిచింది.

స్టేషన్ దిగువ ఒక చింతచెట్టు నీడలో ఒక పొడవాటి బండమీద పులిజూదం ఆడుతున్న నలుగురైదుగురు కనిపించారు. నెమ్మదిగా వాళ్ళ దగ్గరకు వెళ్ళి మాటలు

కలపాలనే ఉద్దేశంతో 'చింతకుంటేనా మీది' అనడిగాను. వాళ్ళు నన్నూ, నా ఆకారాన్నీ క్షణంసేపు చూసి అవునన్నట్టు తలాడించారు.

"ఈ ఊళ్ళో గంగాధరం అని ఒకతను ఉండాలి. నా వయసే ఉంటుంది. హైస్కూల్లో లెక్కల టీచర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. మీకు తెలుసా" అని విచారించాను.

నాకైతే అనుకూలమైన సమాధానం వస్తుందన్న నమ్మకం బొత్తిగా లేదు. ఎప్పటి గంగాధరం? ముప్ఫయేళ్ళక్రితం డిగ్రీదాకా కలసి చదువుకున్న గంగాధరం. ఇరవై సంవత్సరాలుగా ఎక్కడ పని చేస్తున్నాడో కూడా తెలియని గంగాధరం. ఇప్పుడెక్కడున్నాడని ఈ వెతకడం? వేసవి సెలవులు కదా, సొంత ఊళ్ళో ఉంటాడేమో అన్న చిన్న ఆశ. చిన్న ఆసక్తి – అంతే.

నా మాటలు విని వాళ్ళంతా కొద్దిసేపు ఆలోచనల్లో పడిపోయినట్లు నా ముఖం కేసి కాస్త ఉత్సుకతగా చూస్తూ, "లెక్కల టీచరు అంటే అర్ గంగాధరమే కదా" అని గొణుక్కున్నాడొకాయన.

'ఇంతకూ మనది ఏ ఊరు?' మరొకతను నన్ను పరిశీలనగా చూస్తూ అడిగాడు.

"నాది హైదరాబాద్. ఈ రైల్లో ప్రయాణం చేస్తూ, రైలు ఆగిపోవడం వల్ల ఇక్కడ నిలిచిపోయాను. చింతకుంట పేరు చూడగానే నాకు గంగాధరం గుర్తుకొచ్చాడు. అతనూ, నేనూ చాలా ఏళ్ళ క్రితం కలసి చదువుకున్నాము. అతన్ని చూడకకూడా ఇప్పటికి ఇరవై ఏళ్ళయింది. ఊళ్ళో ఉంటే కలసి పలకరిద్దామని ..." అని వివరంగా చెప్పుకొచ్చాను.

'లేకేం... మీ గంగాధరం నిక్షేపంగా ఊళ్ళోనే ఉన్నాడు. ఈమధ్యనే రిటైరై ఇంటి పట్టునే ఉంటున్నాడు. చాలా మంచి మనిషి. ఇక్కడి నుండి నేరుగా చూడండి. పెద్ద వేపచెట్టు కనిపిస్తూ ఉంది కదా! ఆ వేపచెట్టు పక్కనే చిన్న సందు ఉంది. ఆ సందులో మీరు నాలుగడుగులు వేస్తే ఎడమవైపు పచ్చరంగులో ఒక ఇల్లు కనిపిస్తుంది. ఆ ఇల్లే గంగాధరానిది. నిన్న కూడా నాకు ఇంటి దగ్గర కనిపించినట్లే గుర్తు' అంటూ చేయి చూపిస్తూ నాకు దారి చూపించాడు, ఆ గుంపులో ఒకతను.

'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని, "నాకయితే నమ్మకమే లేదు, గంగాధరం ఊళ్ళో ఉండగలడని, వెళ్ళొస్తానండీ" అని చెప్పి ముందుకు నడిచాను సంతోషంతో.

గంగాధరం నా వయసువాడే కదా! అప్పుడే రిటైర్ కావడం ఏమిటి? నాకింకా అయిదేళ్ళ సర్వీసుంది. అనారోగ్యంలాంటి కారణాలతో పదవీవిరమణ చేశాడేమో అని ఆలోచిస్తూ, వాళ్ళు చెప్పిన గుర్తులు పట్టుకొని వేపచెట్టు దగ్గర మలుపు తిరిగి, సన్నటి ఆ సందులో అడుగులు వేస్తూ పచ్చరంగున్న ఇంటిముందు ఆగాను.

ఆ ఇంటి ముందు బండలు పాతిన ఒక చిన్న కాంపౌండు. కాంపౌండు మధ్యలో ఒకే రెక్క ఉన్న చిన్న ఇనుపగేటు. గేటు తెరచుకుని లోపలకు అడుగుపెట్టాను. గేటుకూ ఇంటికీ మధ్య గల కొద్దిపాటి ఖాళీ స్థలంలో ఒక మునగచెట్టూ, రెండు

బొప్పాయి చెట్లూ, ఒక పెద్ద మల్లెపొదా; నాలగైదు పూలమొక్కలూ – ఆవరణ ఆకర్షణీయంగా పొందికగా కనిపించింది నాకు.

ఇల్లు తలుపు తెరిచే ఉంది. నేను తలుపు దగ్గర నిలబడి లోపలి వేపు చూశాను. హోలులా కనిపించే ఆ గదిలో చాపమీద కూచుని ఏదో రాసుకుంటున్న ఓ అమ్మాయి, తలుపు దగ్గర ఆకారం కదలిక గమనించిందేమో తలెత్తి, వెంటనే లేచి నా ఎదుటకు వచ్చి నిల్చుని, "మీరు..." అని ప్రశ్నార్థకంగా అడిగింది.

"నా పేరు రామకృష్ణ. హైదరాబాద్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. నేనూ, గంగాధరమూ చాలా ఏళ్ళు కలిసి చదువుకున్నాము. ఈ ఊరిమీదుగా ప్రయాణం చేస్తూ రైలు ఆగిపోయి, వాకబు చేస్తూ ఇలా వచ్చాను. గంగాధరం ఉన్నాడామ్మా" అనడిగాను.

"రండి. లోపలకు రండి. నేను వారి అమ్మాయిని" అంటూ నా చేతిలోని బ్రీఫ్‌కేస్‌ను మర్యాదపూర్వకంగా అందుకొని ఎంతో ఆదరంతో లోపలకు ఆహ్వానించింది.

నేను లోపలకు అడుగుపెట్టాను. ఆ అమ్మాయి కుర్చీ చూపించగా అందులో కూచున్నాను. ఆ అమ్మాయి ఫాన్ వేసింది చల్లటి గాలిలో అలసట తీర్చుకుంటూ, "మీ నాన్న ఇంట్లో లేడామ్మా" అనడిగాను.

"నాన్న ఉదయమే ఆఫీసు పని మీద టౌన్‌కెళ్ళాడు. సాయంత్రం అయిదింటికి బస్సు ఉంది. తప్పక వస్తాడు. ముందు స్టేషన్ దగ్గర గూడ్సు బండి పట్టాలు తప్పిందట గదా. మీ రైలు ఎప్పుడు కదులుతుందో ఏమో? నీళ్ళు తోడుతాను. స్నానం చేసి రెస్టు తీసుకోండి" అంది ఆ అమ్మాయి, ఆత్మీయమైన స్వరంతో.

ఆ అమ్మాయి వయసు ఇరవైరెండో, ఇరవైమూడో ఉండవచ్చు. పచ్చటి పసిమి ఛాయ. కోలముఖం. పెద్ద పెద్ద కళ్ళు, సూదిమొన ముక్కు, గులాబీరంగు చీరలో, ఒత్తయిన తలకట్టుతో, పొడవాటి జడతో చూడముచ్చటగా ప్రసన్నంగా కనిపించింది నాకు.

"నీ పేరేమిటమ్మా" అనడిగాను.

"కరుణ" అని చెప్పిందా అమ్మాయి.

"ఇరవై ఏళ్ళకు పైనయింది మీ నాన్నను చూసి. చదువుకొనే రోజుల్లో మాది చాలా మంచి స్నేహం. ఇంటరూ, బి.ఏ కలసి చదువుకున్నాం. మీ నాన్న బి.ఇడి కెళ్తే, నేను పి.జి. కెళ్ళడంతో విడిపోయాం మేము. నేను ఉద్యోగరీత్యా జిల్లా విడిచిపోవడంతో మరీ దూరమయిపోయాం. ఇప్పుడిలా కలుసుకోవడం ఏదో నాటకీయంగా ఉంది" అన్నాను.

నా మాటలు శ్రద్ధగా విని, "మిమ్మల్ని చూస్తే మా నాన్న కూడా చాలా ఆనందిస్తాడు. ముందు మీరు స్నానం చేయండి. మీకు ఈలోగా టిఫిన్ తయారుచేస్తాను" అంటూ కదలబోతుండగా, "ఇంట్లో ఒక్కతివీ ఉన్నట్లున్నావు మీ అమ్మ కనిపించలేదు గదమ్మా" అనడిగాను.

ఈ మాటకు ఆ అమ్మాయి ముఖం కాస్త ముడుచుకుపోయింది. "మా అమ్మ పోయి నాలుగేళ్ళు అయింది. అంకుల్" అంటూ తల దించుకుంది.

"సారీ... అయాం వెరీ సారీ" అన్నాను, ఆమె ముఖంలోని దిగులును గుర్తించి,

స్నానం చేసి, కరుణ అందించిన వాళ్ళ నాన్న పంచె కట్టుకున్నాను. ఈలోగా చపాతీలు తయారుచేసి, రుచికరమైన వేడి కూరలతో నాకు వడ్డించింది. నా ఆహారపు అలవాట్లను అడిగి తెలుసుకుంది. ఆ అమ్మాయి ఆదరణ అపూర్వంగా అనిపించి కళ్ళు చెమ్మగిల్లాయి నాకు.

టిఫిన్ తింటూ వాళ్ళ కుటుంబ వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాను.

గంగాధరానికి ముగ్గురమ్మాయిలు. మగపిల్లలు లేరు. భార్య దీర్ఘకాలం రోగిష్టిగా ఉండిపోవడంతో గంగాధరం ఆర్థికంగా బాగా కుంగిపోయాడు. భార్య నాలుగేళ్ళక్రితం చనిపోయింది. ఆమె చనిపోయేందుకు మూడు నెలల ముందు పెద్ద కుమార్తెకు వివాహం చేశాడు. అందుకోసం తనకున్న పదెకరాల మెట్టను అమ్మవలసివచ్చింది. సంవత్సరం క్రితం రెండో అమ్మాయి పెళ్ళికోసం ఐచ్ఛికంగా ఉద్యోగవిరమణ చేసి, ఆ వచ్చిన డబ్బుతో పెళ్ళి జరిపించాడు. మూడో అమ్మాయి కరుణ బి.ఏ., బి.ఇడి చేసి ఇప్పుడు ప్రైవేటుగా ఎం.ఏ. చదువుతూంది.

ఈ విషయాలన్నీ కరుణ మాటలవల్ల నేను అర్థం చేసుకున్నాను. ఆ అమ్మాయి తన తండ్రి పట్ల ఎంతో ఇష్టంతోనూ, ప్రేమతోనూ, తన తండ్రి స్థితి పట్ల అనుకంపనంతోనూ ఈ విషయాలన్నీ చెప్పుకొచ్చిందేగాని, తమ కష్టాలను ఏకరువు పెట్టుకోవడం ఉద్దేశం కాదని ఆ అమ్మాయి మాటల వల్ల నాకర్థమయింది.

టిఫిన్ చేసిన తర్వాత మంచం వాల్చి "మీరు కొద్దిసేపు విశ్రాంతి తీసుకోండి అంకుల్. ఈలోగా నాన్న వస్తాడు" అంది కరుణ.

నేను ఈ ఇంట్లోకి అడుగుపెట్టి ఇంకా గంట కూడా కాలేదు. అయినా, కరుణ మాటతీరువల్ల, ప్రవర్తనవల్ల, ఆదరణవల్ల ఆ కొద్దిసేపట్లోనే నేను ఆ ఇంటి మనిషైపోయినంత అనుభూతి కలిగింది. అత్యంత సున్నితమూ, కరుణాభరితమూ అయిన ఆమె కంఠస్వరం నన్ను మృదువుగా స్పృశిస్తూనే ఉంది.

మంచంపై నడుం వాల్చి, ఒక అరగంటసేపు సుఖనిద్రలో ఉండిపోయానేమో, అడుగుల చప్పుడూ, మాట పలకరింపూ వినిపించి లేచి కూచున్నాను. గంగాధరం ఎదురుగా నిలబడి ఉన్నాడు. అతని పక్కనే కరుణ నా గురించి ఏదో చెబుతున్న ధోరణిలో నిలబడి ఉంది.

"నన్ను గుర్తు పట్టావా గంగాధరం" అంటూ పలకరించాను.

"ఎందుకు గుర్తుపట్టలేదు కృష్ణా? వెంట్రుకలు కొద్దిగా తెల్లబడడంతప్ప నీలో పెద్ద మార్పేమీ లేదు. ఇలా నువ్వు మా ఇంటికి రావడం నాకెంతో ఆనందంగా ఉంది" అంటూ నా పక్కన కూచుని నా భుజం చుట్టూ చేయి వేశాడు.

గంగాధరంలో మాత్రం చాలా మార్పు వచ్చింది. ముఖంలోనూ, కళ్ళలోనూ మునుపటి కాంతి మచ్చుకైనా లేదు. నాకంటే నాలుగైదేళ్ళు పెద్దవాడిలా కనిపిస్తున్నాడు.

'మీ అమ్మాయి కరుణ ఒక్క గంటలోనే నన్ను మీ ఇంటివాణ్ణి చేసింది గంగాధరం' అంటూ కరుణ చేతుల్ని ఆప్యాయంగా స్పృశించాను.

అప్పటి నుంచి సమయమెలా గడచిపోయిందో మాకు తెలియనేలేదు. ఎన్నో గత స్మృతుల్ని వెలికి తీసుకొచ్చాము. కాలేజీ రోజుల్ని గుర్తు తెచ్చుకున్నాము. పాత బంధుత్వాల్ని తిరగేసుకున్నాము. అప్పట్లో చదివిన పుస్తకాల్నీ, ఇష్టమైన కవుల్నీ స్మరించుకున్నాము.

"నేటి హేమంత శైత్యానికి గడ్డకట్టుకున్న నా వెనుక, నాటి వాసంత విహారాల జాడలున్నవన్న తృప్తి మాత్రం మిగిలి, ఒక్క జీవకణమైనా రగిలి శాంతిని పొందుతుంది నా మనస్సు" అంటూ తిలక్ కవిత్వ భాగాల్ని, కన్నీటి పొరలమధ్య వినిపించి మనసును ఆర్ద్రం చేశాడు గంగాధరం.

రాత్రి తొమ్మిది గంటలకల్లా ఎంతో ఇష్టమైన వంటకాలతో భోజనం పెట్టింది కరుణ. భోజనం చేస్తున్నప్పుడు "మా అమ్మాయే నాకు తల్లి" అంటూండగా గంగాధరం గొంతు వణకింది.

భోజనాల తర్వాత మళ్ళీ వర్తమానంలోకి వచ్చేశాము. మా కుటుంబం గురించి, నా ఉద్యోగంలో వచ్చిన ప్రమోషన్లు గురించి, మా పిల్లల గురించి గంగాధరం అడిగి తెలుసుకొన్నాడు.

మాకు ఇద్దరే అబ్బాయిలనీ, పెద్దవాడు వరంగల్లు కాకతీయ యూనివర్సిటీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడనీ, పెళ్ళయి నాలుగేళ్ళయిందనీ, ఇద్దరు పిల్లలనీ చెప్పాను. చిన్నవాడు బి.టెక్ పూర్తి చేసి ఈమధ్యనే ఉద్యోగంలో చేరాడనీ చెప్పాను. తన విషయాలు ప్రస్తావించినప్పుడు మాత్రం గంగాధరం దాటవేసే ప్రయత్నం చేశాడు.

రాత్రి పది గంటలు కావస్తుండగా, రైలు మరో అరగంటలో ప్రయాణం ప్రారంభిస్తుందన్న వర్తమానం తెలిసింది.

"ఇంత రాత్రివేళ ఎందుకులే అంకుల్? రేపు ఉదయం లోకల్ పాసెంజర్ ఉంది - వెళ్ళవచ్చు" అంది కరుణ.

"నేను నా ప్రయాణాన్ని రద్దు చేసుకున్నానమ్మా. వెళ్ళినా పని జరగదు. రేపు ఉదయం తిరుగుప్రయాణం చేస్తాను" అన్నాను. ఆ రాత్రి అక్కడే ఉంటున్నందుకు గంగాధరం ఎంతో సంతోషించాడు. పెరట్లో మంచాలు వేసుకొని, వెన్నెల్లో తడుస్తూ మాటల్లో పడిపోయాము.

ఉదయం నిద్రలేవగానే తిరుగు ప్రయాణానికి రైలు సమయాలు అడిగి తెలుసుకున్నాను. ఉదయం తొమ్మిదింటికి రైలు ఉందని తెలిసింది. ఆ రోజంతా అక్కడే ఉండమని గంగాధరం బలవంతం చేశాడు. మళ్ళీ తప్పక వస్తానని హామీ ఇచ్చి, టిఫిన్ చేసిన తర్వాత బయలుదేరాను. దారిలో నేను ఇబ్బందిపడకుండా కరుణ చిన్న కారియర్‌లో టిఫిన్‌నూ, వాటర్‌బాటిల్‌నూ సిద్ధం చేసి ఇచ్చింది.

నేనూ, గంగాధరమూ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాము. టికెట్ తీసుకొని ప్లాట్‌ఫామ్ మీద నిలబడ్డాము.

"మళ్ళీ ఎప్పుడు కలుస్తామో ఏమో" అన్నాడు గంగాధరం.

"ఇక ఇప్పట్నుంచీ మనం శాశ్వతంగా కలుసుకోబోతున్నాం గంగాధరం. అసలు నిన్న నాప్రయాణం గురించి నీకు చెప్పనేలేదు. మా రెండో అబ్బాయికి సంబంధం చూడడంకోసమే నిన్న బయలుదేరాను. అనుకోని విధంగా రైలు ఇక్కడ ఆగిపోవడం, నేను మీ ఇంటికి రావడం, కరుణను చూడడంతో నా ప్రయాణాన్నే రద్దు చేసుకున్నాను. నా ఊహల్లో చాలాకాలంగా కరుణ లాంటి ఆడపిల్ల మెదలుతూ ఉంది. నీకు అభ్యంతరం లేకపోతే, ఏ బైండింగ్సూ లేకపోతే కరుణను నేను చాలా ఇష్టంగా నా కోడలుగా చేసుకుంటాను" అంటూ గంగాధరం భుజాలమీద చేతులు వేశాను. గంగాధరం చిన్న 'షాక్' తిన్నవాడిలా క్షణకాలం కంపించినట్లు నాకనిపించింది.

"ఏమంటున్నావ్ కృష్ణా? ఇది నిజమేనా? నా ఊహకు కూడా అందని వాస్తవాన్ని నమ్మమంటావా" అన్నాడు జీరపోయిన గొంతుతో.

"నిజం గంగాధరం. మరో పది రోజుల్లో మొత్తం కుటుంబంతో ఇక్కడికి వస్తున్నాను. తాంబూలాలు పుచ్చుకుందాం." అని అన్నాను గంగాధరాన్ని దగ్గరగా తీసుకుంటూ.

"కానీ, కృష్ణా—ఈ సంబంధానికి నేను తూగలేనేమో! నా స్థితిగతులు నీకు అర్థమయ్యే ఉండాలి" అన్నాడు బరువుగా.

"అలాంటి ఆలోచనలేమీ పెట్టుకోవద్దు. మాకు కరుణను మించి ఏ కానుకలూ అక్కరలేదు." అంటూండగా రైలు వస్తున్న శబ్దంతోపాటు, మధురమైన కూత కూడా వినిపించింది.

*(ఇండియా టుడే - సెప్టెంబర్ 1997)*

★ ★ ★